క్లుప్తంగా

31న తలనీలాల వేలంపాట

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథ స్వామి దేవాలయంలో ఈ నెల 31వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు తలనీలాల వేలంపాట నిర్వహించనున్నట్లు ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 2వ తేదీ నుంచి 2025 ఫిబ్రవరి 5వ తేదీ వరకు ఏడాది పాటు తలనీలాలు పోగుచేసుకునే హక్కుల కోసం వేలంపాట నిర్వహిస్తామని పాటదారులు లక్ష రూపాయలు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

స్నేహితురాలి చికిత్సకు ఆర్థిక సాయం



వరలక్ష్మికి నగదు అందజేస్తున్న స్నేహితులు

తుగ్గలి: 'ఆపదలో అవసరాన్ని.. బాధల్లో మనసును తెలుసుకొని సహాయపడే వాళ్లే నిజమైన స్నేహితులు' ఈ మాటలు కొందరు మిత్రులు అక్షర సత్యం చేశారు. 1996–2001 మధ్యలో జొన్నగిరి జెడ్పీహెచ్ఎస్‌లో కలిసి మెలిసి చదువుకున్నారు. వారిలో పీ.కొత్తూరుకు చెందిన వరలక్ష్మి కిడ్నీ వ్యాధికి గురై వైద్యం పొందుతోంది. విషయం నాడు చదువుకున్న మిత్రులకు తెలిసింది. వెంటనే స్పందించి తమ వంతుగా రూ.25 వేలు పోగుచేసి శుక్రవారం మిత్రురాలికి అందజేశారు. దేవుడి దయతో త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర కమిటీలో చోటు



అత్తులూరి కిరణ్

వెల్దుర్తి(కృష్ణగిరి): గుంటూరులో శుక్రవారం జరిగిన ఆర్య వైశ్య మహాసభ రాష్ట్ర కమిటీ ఎన్నికలో వెల్దుర్తికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త అత్తులూరి కిరణ్ యువజన కమిటీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై ప్రమాణ స్వీకారం చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్యవైశ్య యువత ఆర్థికాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఆయన ఎన్నిక పట్ల మండల ఆర్య వైశ్య ప్రముఖులు అభినందనలు తెలిపారు.

ఉరుసు ప్రారంభం

పత్తికొండ రూరల్: పత్తికొండ–ఆదోని రోడ్డులో కొలువైన సయ్యద్ షా అలీ అక్బర్ ఖాద్రి, సయ్యద్ షా అబ్దుల్ హమీద్ ఖాద్రి స్వాముల వారికి శుక్రవారం గంధం సమర్పణ చేసి ఉరుసు ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఏటా నిర్వహించే స్వామివారి ఉరుసు మహోత్సవానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా శనివారం ఉరుసు మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశారుమని, ఆదివారం ఫతేహాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

సాంకేతికత అందిపుచ్చుకోవాలి



వ్యవసాయంలో డ్రోన్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

చిప్పగిరి: వ్యవసాయ రంగంలో సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ఏఓ విజయలక్ష్మి రైతులకు సూచించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా శుక్రవారం మండలంలోని ఏరూరు గ్రామంలో వ్యవసాయ డ్రోన్ ప్రదర్శన నిర్వహించారు. డ్రోన్ పనితీరుపై రైతులకు అవగాహన కల్పించారు. మారుతున్న కాలానికనుగుణంగా వ్యవసాయంలో సాంకేతికను వినియోగించుకోవడం ద్వారా పెట్టుబడి ఖర్చు తగ్గించుకొని అధిక దిగుబడులు సాధించాలని రైతులకు సూచించారు. సర్పంచ్ వెంకటలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

కురువలు చైతన్యవంతం కావాలి

హొళగుంద: కురువలు చైతన్యవంతులు అయినప్పుడే అన్ని రంగాల్లో రాణిస్తారని సంగోళి రాయన్న సేన ఆలూరు తాలూకా ప్రధాన కార్యదర్శి మంజునాథ గౌడ్ అన్నారు. శుక్రవారం హొళగుంద భీరలింగేశ్వర స్వామి ఆలయంలో సైరా సంగోళీరాయన్న 193వ వర్ధంతి కార్యక్రమాన్ని కురువలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల్లో గూడుకట్టుకున్న అజ్ఞానాన్ని తొలగించిన మహావ్యక్తి సంగోళీరాయన్న అని కొనియాడారు. ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు.అలాగే కురవలు తమ పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలని, ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదిగేందుకు పోరాటాలు చేయాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో మాదాసి, మాదారి కురువ సంఘం నాయకులు నరగల్ల, మంజు, భీరప్ప, మల్లయ్య, గాదిలింగ, పంపన్న, రవిచంద్ర, సిద్దప్ప తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో జాతీయ జెండాను ఎగురవేస్తున్న కమిషనర్, చైర్మన్



ఎమ్మిగనూరులో రక్తదానం చేస్తున్న ముస్లింలు



కనకవీడులో జాతీయ హాకీ పోటీలకు ఎంపికైన అనసూయను సన్మానిస్తున్న దృశ్యం



గోనెగండ్ల ఎంపీడీఓ కార్యాలయంలో జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ నసురుద్దీన్, అధికారులు



పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జెండా ఎగురవేస్తున్న జడ్జి దివ్య

వాడవాడలా గణతంత్ర పండుగ

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో శుక్రవారం గణతంత్ర దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక జూనియర్ సివిల్ కోర్టు వద్ద జడ్జి గురుఅరవింద్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ గంగిరెడ్డి, చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, టౌన్ బ్యాంక్, కోఆపరేటివ్ స్టోర్స్ చైర్మన్లు యుకె రాజశేఖర్, షబ్బీర్, ఎంఆర్‌సీ వద్ద ఎంఈఓలు ఆంజనేయులు, మధుసుదన్‌రాజు, రెవిన్యూ కార్యాలయం వద్ద తహసీల్దార్ ఆంజినేయులు,హౌసింగ్ కాయాలయం వద్ద డీఈ ప్రసాద్, ఎల్లెల్సీ ఆఫీస్ వద్ద డీఈ లక్ష్మణ్‌కుమార్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఎన్‌సీసీ, స్కౌట్ విద్యార్థినులు నిర్వహించిన పరేడ్, గౌరవ వందన కార్యక్రమం ఆకట్టుకున్నాయి. పాఠశాలల్లో జరిగిన వేడుకల్లో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మున్సిపాలిటీలో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు కమిషనర్ గంగిరెడ్డి, ఆర్టీసీ డిపోలో కార్మికులకు మేనేజర్ అమర్నాథ్ ప్రశంసా పత్రాలను అందజేశారు.

ముస్లింల రక్తదానం: రిపబ్లిక్‌డేను పురస్కరించుకొని పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయ సమీపంలో సలాఫి బైతుల్‌మాల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.సంఘ అధ్యక్షులు ఉమర్ మౌలానా,శిఫరుల్లామౌలానా,కొండాపురి ఖదిర్, షాలిమార్ నజీర్, మనియార్ అమమానుల్లా, ముజిబ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో ముస్లింలు అధిక సంఖ్యలో రక్తదానం చేశారు.

ఎమ్మిగనూరురూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఎంపీపీ కేశన్న, ఎంపీడీఓ బంగారమ్మ, ఏడీఏ కార్యాలయంలో ఏడీఏ జమ్మన్న, ఏఓ మహేశ్వరరెడ్డి, బనవాసి జవహర్ నవోదయ విద్యాయలంలో ప్రిన్సిపాల్ పద్మావతి, కేవీకేలో డాక్టర్ సుజాతమ్మ, కడిమెట్ల సహకార సొసైటీ, ఎర్రకోట జెడ్పీ పాఠశాలలో జగన్‌మోహన్‌రెడ్డి జెండా ఆవిష్కరణ చేశారు. నవోదయ విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పిరమిడ్ అకృతిలో విన్యా సం, దేశభక్తి గీతాలకు నృత్యాలు అలరించాయి.

నందవరం: మండలంలోని రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ నిత్యానందరాజు, కనకవీడు గ్రామ సచివాలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంతరెడ్డి, పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ తిమ్మయ్య, పీహెచ్‌సీలో వైద్యాధికారిణి సౌజన్యలత, వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో ఏపీఎం చిన్న వీరన్న తదితరులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. జొహరాపురంలో హెచ్‌ఎం గోకారి ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. విద్యార్థులు వాడవాడల్లో జెండాలతో ఊరేగింపు చేపట్టారు. చిన్నారుల ఆటపాటలు, సమరయోధుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. కనకవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని అనసూయ జాతీయ హాకీ పోటీలకు ఎంపిక కావడంతో శాలువా, పూలమాలతో సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ్, సర్పంచులు విరుపాక్షిరెడ్డి, తోట సావిత్రి, జెడ్పీటీసీ నిఖిల్ చక్రవర్తి, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ టి.నసురుద్దీన్, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అలాగే తహసీల్దార్ కార్యాలయంలో వేణుగోపాల్, పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ తిమ్మారెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈఓఆర్డీ నాగేష్, ఏఓ బాబుభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండటౌన్: ప్రజలంతా సోదరభావంతో కలసిమెలసి జీవించాలని, అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని జూనియర్ సివిల్ జడ్జి వి.దివ్య, ఆర్‌డీఓ నీలపు రామలక్ష్మి సూచించారు. స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జడ్జి వి.దివ్య, ఆర్‌డీఓ కార్యాలయంలో ఆర్‌డీఓ నీలపు రామలక్ష్మి, మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ విష్ణుప్రసాద్, పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ గోపాల్, మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కవిత, ఎంపీపీ నారాయణదాసు జాతీయ జెండా ఎగురవేశారు. వక్తలు రిపబ్లిక్ డే సందేశం వినిపించారు. అలాగే వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎంపీపీ నారాయణదాసు జాతీయ జెండాను ఆవిష్కరించారు. పార్టీ నాయకులు శ్రీరంగడు, సోమశేఖర్, నాగరాజు పాల్గొన్నారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): మండలంలో కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలు, గురుకులాల్లో అధికారలుఉ జాతీయ జెండా ఆవిష్కరించారు. విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించారు.పాతబస్టాండులో అంబేడ్కర్, తెలుగుతల్లి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. రాజ్యాంగం గొప్పతనం, రూపుదిద్దుకున్న, అమలైన విధానాలను వక్తలు వివరించారు. ఆట పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులందించారు.

తుగ్గలి: మండలంలో తహసీల్దార్ రవి, జెడ్పీటీసీ సభ్యుడు పులికొండనాయక్, ఎంపీపీ ఆదెమ్మ, సింగిల్ విండో అధ్యక్షులు విజయలక్ష్మి, గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు మల్లికార్జున రెడ్డి, నాగప్ప, బీసీవై నాయకులు మిద్దె వెంకటేష్, ఎస్‌ఐలు మల్లికార్జున, రామాంజినేయులు తదితరులు ఆయా కార్యాలయాల వద్ద జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. మహాత్మ గాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మద్దికెర: మండలంలో వాడవాడలా జాతీయపతాకాన్ని ఆవిష్కరణ చేసి గౌరవ వందనం చేశారు. వక్తలు మాట్లాడుతూ..మహనీయుల స్ఫూర్తితో ప్రతిఒక్కరూ ముందుకు సాగాలన్నారు. ఎంపీడీఓ నరసింహమూర్తి, తహసీల్దార్ నాగభూషణం, జడ్పీటీసీ దేవిరెడ్డి మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ డీఎస్ అనిత, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణగిరి: మండలంలో తహసీల్దార్ రాజేశ్వరి, ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, ఎంపీడీఓ రామస్వామి, ఏపీఓ శేషిరెడ్డి, ఎంఈఓ సునంధ, తదితరులు ఆయా కార్యాలయాల వద్ద జాతీయ జెండా ఎగురవేసి వందనం చేశారు. ప్రపంచంలోనే గొప్ప రాజ్యాంగం రచించిన మహనీయులను స్మరించుకోవాలన్నారు.

ఆలూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రామాంజనేయులు, పోలీసుస్టేషన్‌లో బి.వెంకటేశ్వర్లు, విద్యుత్ శాఖ ఏడీఈ కార్యాలయంపై నాగేంద్ర, వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏడీఏ సునిత, ఎంపీడీఓ కార్యాలయంపై ఎంపీడీఓ అల్లబకాష్, పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అరుణాదేవి జాతీయ జెండాను ఎగురవేశారు.

ఆలూరు రూరల్: ప్రతిఒక్కరూ రాజ్యాంగ స్ఫూర్తి చాటాలని ఆలూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి హేమ అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో ఆమె జాతీయ జెండాను ఆవిష్కరించారు. భారత రాజ్యాంగ విశిష్టతను వివరించారు. అలాగే ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఎంపీపీ మంగమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు ఏరూరు శేఖర్, ఎంపీడీఓ అల్లబకాష్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రామాంజినేయులు త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసు సర్కిల్ కార్యాలయంలో సీఐ వెంకటేశ్వర్లు, గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అరుణ జాతీయ జెండాను ఆవిష్కరించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవలను కొనియాడారు.

చిప్పగిరి: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జూటూరు హేమలత, తహసీల్దార్ కార్యలయంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ జాతీయ జెండా ఆవిష్కరించారు. కన్వీనర్ మారయ్య, వీఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పరి: మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ మూలింటి రాధమ్మ, రెవెన్యూ కార్యాలయం వద్ద తహసీల్దార్ కుమారస్వామి, మండల పరిషత్ వద్ద ఎంపీపీ సుంకర ఉమాదేవి, పోలీస్ స్టేషన్ ఆవరణలో సీఐ హనుమంతప్ప, తదితరులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, మూలింటి రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

దేవనకొండ: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీపీ లక్ష్మిదేవి, ఎంపీడీఓ గౌరీదేవి జాతీయ జెండాను ఎగురవేశారు. వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ సిబ్బంది జెండాను ఎగురవేశారు. గణతంత్ర దినోత్సవ విశేషాలను తెలియజేశారు.

హొళగుంద: హొళగుంద మేజర్ పంచాయతీ, తహసీల్దారు, ఎంపీడీఓ కార్యాలయాలు, ఎంఆర్‌సీ, పోలీస్‌స్టేషన్, సింగిల్ విండో, అగ్రికల్చర్, పీహెచ్‌సీలు, ఇతర కార్యాలయాలో ఏఎస్‌ఐ శ్రీనివాసులు, తహసీల్దారు హుసేన్‌సాహెబ్, ఎంపీపీ తంబాకు నూర్జహన్, ఎంపీడీఓ సుహాసినమ్మ, సర్పంచ్ చలవాది రంగమ్మ, తదితరులు జాతీయ జెండావిష్కరణ చేశారు.

హాలహర్వి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వైస్ ఎంపీపీ నగేష్, ఎంపీడీఓ ఆంతోని, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మల్లికార్జున జాతీయ జెండాను ఎగురవేశారు. అలాగే అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, ఆస్పత్రుల్లో జాతీయ జెండాను ఎగురవేశారు.



బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో జాతీయ జెండాతో విద్యార్థుల విన్యాసం



సుళువాయి కొండపై జాతీయ జెండా ఎగురవేసిన గ్రామ యువకులు



పత్తికొండలో గాంధీజీ, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఆర్డీఓ నీలపు రామలక్ష్మి



వెల్దుర్తిలో జెండా వందనం చేస్తున్న తహసీల్దార్ శివరాముడు



గజ్జహళ్లిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద సంబరాలు చేసుకుంటున్న గ్రామస్తులు



మద్దికెరలో జెండా వందనం చేస్తున్న అధికారులు



ఆలూరులో జెండా ఎగురవేస్తున్న జడ్జి హేమ



ఆస్పరిలో జెండా ఎగురవేస్తున్న తహసీల్దార్



శంకరబండలో డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు



ఆలూరులో జెండాను ఆవిష్కరించిన సర్పంచ్



స్వతంత్ర్య సమరయోధుల వేషధారణలో చిన్నారులు

మహిళ అనుమానాస్పద మృతి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని సిరాలదొడ్డి విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని బావిలో శుక్రవారం అనుమాన్పద స్థితిలో మహిళ మృతదేహం బయటపడింది. వివరాలు.. పట్టణంలోని పెద్దకమేలా ప్రాంతంలో వడ్డె శివకృష్ణ, పద్మావతి దంపతులు నివాసముంటున్నారు. ఉదయం పద్మావతి (31) ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లింది. తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారి ఇళ్లలో విచారించగా ఆచూకీ తెలియలేదు. సాయంత్రం సిరాలదొడ్డి సబ్‌స్టేషన్ సమీపంలోని వ్యవసాయ బావిలో మృతదేహాన్ని గమనించిన రైతులు వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆమె భర్త శివకృష్ణ రూరల్ పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్‌ఐ శరత్‌కుమార్ ఘటనా స్థలానికి వెళ్లి బావి నుంచి మృతదేహాన్ని బయటకు తీయించారు. ఆమె మృతికి కారణాలు తెలియలేదని, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రూరల్ ఎస్‌ఐ

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి



చిట్యాలలో విద్యార్థులకు ట్యాబ్‌లు అందించిన దృశ్యం



పెండేకల్లు రైల్వే జంక్షన్ జెడ్పీ హెచ్ఎస్‌లో విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న దృశ్యం

కృష్ణగిరి: విద్యాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలను సాధించాలని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి సూచించారు. మండల పరిధిలోని చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు శుక్రవారం ఆయన కోయిలకొండ సొసైటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, హెచ్‌ఎం సురేష్ బాబుతో కలిసి ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యాభివృద్ధికి సీఎం జగనన్న అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, వైఎస్సార్ సంపూర్ణ పోషణ, నాడు–నేడు వంటి పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. పథకాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు ఉన్నతంగా రాణించాలన్నారు. విద్యా కమిటీ చైర్మన్ బసవరాజు, గ్రామ నాయకులు రాముడు, బాల ఈశ్వరయ్య, రాజు, మధుసూదన్‌గౌడ్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ట్యాబ్‌ల పంపిణీ

తుగ్గలి: మండల పరిధిలోని పెండేకల్లు రైల్వే జంక్షన్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 8వ తరగతి చదువుతున్న 97 మంది విద్యార్థులకు హెచ్‌ఎం నరేంద్ర, పీఎంసీ చైర్మన్ నాగరాజు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డితోనే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోందని పీఎంసీ చైర్మన్ అన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ

ఆలూరు రూరల్: స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాల–2లో చదువుకున్న 1989 సంవత్సరం 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆలూరు తహసీల్దార్ రామాంజనేయులు, మల్లికార్జున, సర్మస్ శుక్రవారం పాఠశాలకు రూ.20 వేలు విలువైన కంప్యూటర్ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు విద్యను ప్రసాదించిన పాఠశాలకు ఎంత మేలు చేసినా తక్కువేనన్నారు. చిన్ననాటి నుంచే శ్రద్ధగా చదువుకుంటే ఉన్నత స్థాయికి ఎదుగుతారని విద్యార్థులకు తెలియజేశారు. అనాడు పాఠాలు బోధించిన గురువులను గుర్తుచేసుకున్నారు. హెచ్‌ఎం సత్యనారాయణ, పీడీ కవిరాజు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.



ఆలూరు ప్రభుత్వ బాలుర పాఠశాల–2కు కంప్యూటర్ అందిస్తున్న పూర్వ విద్యార్థులు

పక్కాగా కులగణన

హొళగుంద: మండలంలోని ఆయా గ్రామాలలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు నిర్వహిస్తున్న కులగణన సర్వే వేగంగా సాగుతోంది. శుక్రవారం గణతంత్ర దినోత్సవం సెలవు రోజు కూడా హొళగుందతో పాటు అన్ని గ్రామాలలో సిబ్బంది సర్వే నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించి ప్రత్యేక యాప్‌లో యజమాని, వలంటీరు వేలిముద్రలను అప్‌లోడ్ చేస్తున్నారు. యాప్‌లో వివరాలు నమోదు చేసే పనిని వేగవంతం చేసి లక్ష్యాన్ని చేరుకోవాలని ఎంపీడీఓ సుహాసినమ్మ సూచించారు. ఇప్పటివరకు సర్వే 50 శాతానికి పైగా పూర్తయినట్లు ఆమె వెల్లడించారు.

ఏర్పాట్ల పరిశీలన

పత్తికొండ రూరల్: పత్తికొండలో ఈనెల 28న టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటన నేపథ్యంలో సభా ప్రాంగణాన్ని ఆ పార్టీ ఇన్‌చార్జ్ కేఈ శ్యాంబాబుతో కలిసి మాజీ మంత్రి భూమా అఖిలప్రియ శుక్రవారం పరిశీలించారు. పత్తికొండ–ఆదోని రోడ్డులోని పెట్రోలుబంకు సమీపంలో స్టేజీ నిర్వహణ, వచ్చిన జనానికి టెంట్‌ల ఏర్పాటు, వాహనాల పార్కింగ్ తదితర ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు తరలివచ్చి చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఘనంగా గంధం ఉత్సవం

తుగ్గలి: మండల పరిధిలోని పెండేకల్లులో కాశీం స్వామి ఉరుసులో భాగంగా శుక్రవారం గంధం ఉత్సవాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో గ్రామం నుంచి గంధాన్ని మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి దర్గాలో ప్రత్యేక పూజలు చేశారు.

వేగంగా కాలువ నిర్మాణం

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి గ్రామంలో ఊరు మధ్య వాగు ఉండడంతో వర్షం వచ్చినప్పుడు రాకపోకలకు ఇబ్బంది ఉందని గ్రామస్తులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ప్రభుత్వం వెంటనే రూ.9 లక్షల నిధులను విడుదల చేసిందని జెడ్పీటీసీ లింగప్ప తెలిపారు. వాగు ప్రాంతంలో కాలువలను ఏర్పాటు చేసి, దానిపై సీసీ రోడ్డు పనులను చేపడతామని చెప్పారు. ప్రజల ఇబ్బందులను తెలుసుకొని ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ మేరకు గ్రామస్తులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మాలింగ, పంచాయతీరాజ్ ఇంజినీర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ ఇంజనీర్ చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



కాలువ నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

తుగ్గలి: ప్రజా సంక్షేమంతో పాటు గ్రామాల అభివృద్ధే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని సర్పంచ్ కమాల్‌బాషా, ఎంపీటీసీ సభ్యురాలు వనమాల పుష్పావతి అన్నారు. ఎంఎస్‌ఆర్‌ఈజీఎస్, గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.10 లక్షలతో రామాపురంలో చేపట్టిన సీసీ రోడ్డు పనులను శుక్రవారం వారు ప్రారంభించారు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సహకారంతో గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామన్నారు. కరోనా విపత్తు వల్ల రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సీఎం వైఎస్ జగనన్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఆపలేదన్నారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని, లబ్ధిపొందిన వారంతా వచ్చే ఎన్నికల్లో జగనన్నకు అండగా నిలవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఓబులేసు, వెంకటేశ్వర్లు, గంగాధర, గోవిందరాజులు పాల్గొన్నారు.



రామాపురంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ సభ్యురాలు

హులేబీడు పాఠశాలకు మహర్దశ



నాడు–నేడు నిధులతో ఆధునికీకరించిన హులేబీడు ప్రాథమిక పాఠశాల



గత ప్రభుత్వ హయాంలో పాఠశాల ఇలా..

ఆలూరు రూరల్: ప్రభుత్వ బడుల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితాలనిచ్చాయి. ఒకప్పుడు విరిగిన గచ్చు.. పెచ్చులూడిన శ్లాబ్, నిత్యం బురదమయంగా ఉండే ప్రాంగణాలతో ఉండేవి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలలు కూడా కార్పొరేట్ స్థాయిలో ఉండాలని నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చేశారు. దీంతో పాఠశాలల అందాలు చిన్నారులను ఆకట్టుకుంటున్నాయి. ఇందుకు ఈ రెండు చిత్రాలే నిదర్శనం. ఆలూరు మండలంలోని హులేబీడు గ్రామంలో ప్రాథమిక పాఠశాల నాడు–నేడుతో సుందరంగా రూపుదిద్దుకుంది.